కథానిక:

# చందు

బస్సు మెలికలు తిరుగుతూ ఎగుడూ దిగుడులమధ్య పోతుంటే క్రింద లోయల్లొ తొంగిచూస్తూ ప్రకృతి సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. చేతిగడియారం చూస్తే అయిదున్నర చూపిస్తోంది సంధ్యా సూర్యుడు పశ్చిమాద్రి వెనక రక్తాంబరం కప్పుకొని హత్యాకారుడివలె పారిపోతూ వియత్తలాన్ని అరుణసిక్తం చేస్తున్నాడు. ఎంతసేపు యీ బస్సు ప్రయాణం? విసుగెత్తుతోంది కూర్చుని కూర్చుని. ఫ్రంటు సీటులో కూర్చున్న నేను "ఇంకెంత దూరం వుంది?" అని డ్రయివరును అడిగా. "ఇంకో పదిహేను మైళ్లు వుంది" అన్నాడు డ్రయివరు సిగరెట్ వెలిగిస్తూ ఎదురుగుండా పొగత్రాగరాదు అని బోర్డు వున్నా.

ఈ కాలంలో వుద్యోగాన్వేషణే ఒక యజ్ఞం అనుకుంటే అది సంపాదించడమే ఒక మహాభాగ్యంగా పరిణమిస్తే యీ వెధవ ట్రాన్సుఫర్లు ఒకటి ప్రాణానికి; బంతిని కొట్టినట్లు యీ కొసనుంచి ఆ కొసకి వేస్తారు. మధ్యాహ్నం ఎపుడో బయలుదేరితే బస్సు యింతవరకు ఊరు అజలేదు. శీతాకాలపు పొద్దేమో క్రమంగా సంధ్యారేఖలు చీకటి తెరల్లో కలిసిపోయి లోకాన్ని అంధకారంలో ముంచెత్తుతున్నాయి. కొత్త వూరు. చీకట్లో వెళ్ళి ఆఫీసు అదీ ఎట్లా కనుకొంటానా అని నాకు దిగులు పట్టుకుంది. నా ప్రయాణ అయిష్టతను గమనించినాడల్లే వుంద డ్రయివరు "ఊరి పొలిమేరలకు వచ్చాం. ఎక్కడ దిగుతారు?" అన్నాడు. "ఇక్కడ కొత్తగా పెట్టిన బ్లాక్ డెవలెప్‌మెంటు ఆఫీసుకి వెళ్ళాలి. కొత్త వూరు" అన్నా. కాసేపట్లో ఒక నాలుగు రోడ్ల జంక్షను దగ్గర ఆపి బస్సును" ఇక్కడ దిగి అడగండి." అన్నాడు డ్రయివరు సాపాయ్యంగా. నేను దిగంగానే పెట్టె, బెడ్డింగు టాపునుంచి దింపించాడు కండక్టరు. బస్సు వెళ్ళిపోయింది. దిగిన ప్రయాణీకుణ్ణి నేనొక్కడినే అక్కడ. చీకటి. మున్సిపల్ దీపాలుకూడ లేవు. దగ్గరలో ఒక కిళ్లీ కొట్టోంచి పడే పెట్రోమాక్సు లైటు దీపకాంతి తప్ప వేరే శరణ్యంలేదు. కాసేపు నిలబడ్డాక ఒక కూలివాడు "కూలి కావాలా" అంటూ వచ్చాడు. "బస్సు లేటయింది. ఇందాకనుంచి నిలబడి వెళ్ళిపోయా ఇవాళ మీరు ఒకరే దిగినటున్నారు. ఎక్కడికి పోవాలి? రండి" అంటూ బేరం, గీరం ఏమీ లేకుండానే

రచన:

"శర్మ"

చొరవతో పెట్టె బెడ్డింగు ఎత్తుకుని బయలుదేరాడు. కొత్తచోటు ప్రభావం అనుకొని బ్లాక్ డెవలెప్‌మెంటు అఫీసుకి అని చెప్పా. కూలివాడు దోవ చూపిస్తుంటే వెనకాలే నేను నడుస్తున్నా. పోయి పోయి చాంతాడు వలె దోవ; చివరకు ఒక గేటుముందు ఆగి" మీరు లోపలికి పదండి" అన్నాడు. లోపల అవరణదాటి వరండాలోకి వెళ్లంగానే రాత్రి జవాను తాళంతీసి పెట్టె బెడ్డింగు పెట్టించాడు. నేను కూలివాడికి డబ్బులు యిచ్చిపంపి, బయట బకెట్‌లో నీళ్లతో కాళ్లు కడుక్కొని, దుస్తులు మార్చుకొని, వరండాలో పక్కవేయించుకొని, దోవలో కొనుక్కున్న పండ్లువుంటే తిని మంచినీళ్లు త్రాగి పడుకొన్నా.

పొద్దున్నే లేవంగానే మిత్రుడు గోవిందరావు బ్రష్‌తో పళ్లు తోముకుంటూ కనిపించాడు. కుశల ప్రశ్నానంతరం ఇద్దరం స్నానాదులు కావించిన తర్వాత "కాఫీకి పోదామా" అన్నాడు గోవిందరావు. "ఊఁ అదిలేకపోతే ఎట్లా?" అనంగానే యిద్దరం హోటలుకు బయలుదేరాం. నడిచి, నడిచిన తర్వాత గోవిందరావు ఒక హోటల్లోకి దోవ తీశాడు. నిన్నటి వరకు యింటి దగ్గర హాయిగా చేతికందిస్తే దుదైన కాఫి తాగినవాడికి యివాళ ఆ కాఫీ కోసం కాళ్ళు బలపాలు కట్టుకుని తిరగాల్సి వచ్చింది. ఎంతలో ఎంత మార్పు!" కూర్చోరా ఎపుడూ ఆలోచిస్తూ వుంటావు?" అని కుర్చీ చూపించాడు. అపుడే ఇడ్లికి ఆర్డరిచ్చాడు. ఆ బల్లలు శుభ్రంగాలేవు. ఈగలు ముసురుతున్నాయి త్రాగేసి వెళ్ళిన వాళ్ళ కాఫీ బల్లమీద ఒక చోట కాల్వ కడుతోంది. ఎక్కడి ప్లేట్లు అక్కడే వున్నాయి

"గోవిందరావు ఏమిటీ హోటలు? నరకంలావుంది. భళ్లున దోకు వస్తోంది. అన్నా. "ఇంతకంటే మంచి హోటలు యీ తాలూకాలోనేలేదు నీకు తెలిసో తెలీదో ఈవూరి కంతటికీ కాస్త కాఫీ యిచ్చేది యీ హోటలే" అన్నాడు. "అయితే కాస్త బల్లలన్నా తుడిపించు" అన్నా. గోవిందరావు నాకంటే ముందుగా రావటం మూలాన వూరి పరిస్థితులు అర్థంచేసికొన్నాడు. "ఏమండీ అయ్యరుగారు! ఈబల్లలు చూడండి ఎంత మురికిగా వున్నాయో! ఎవరో తాగేసి వెళ్లిన కాఫీ మూసీనదిలాగా పారుతోంది! ఇట్లావుంటే మేం రేపటినుంచి మీహోటలుకు రాం" అన్నాడు గోవిందరావు గంభీరంగా నావంక తిరిగిచూస్తూ. అయ్యరు ఎదురుగుండా కూర్చుని డబ్బులు వసూలు చేసుకుంటున్నాడు. నల్లగా, బొద్దుగా, దుబ్బదుపోతన్రింలా వున్నాడు. పైన చొక్కాలేదు. కాష్టంలాంటి లుంగీ వాడిహోటలు స్థితికి తగ్గట్టుగావుంది పరిశుభ్రంలో. గోవిందరావు మాటలు వినంగానే "ఎవడ్రావాడు అక్కడ! ఈబల్లలు తుడవండి" అని పెద్దకేకేసి బెల్లుకొట్టాడు. ఇంతలో ఎనిమిదేళ్ల కుర్రాడొకడు వచ్చి మాబల్లలను రాళ్లతుడిచే గుడ్డపెట్టి తుడిచి

వెళ్ళిపోతూవుంటే" ఎక్కడ చచ్చావురా యిందాకటి నుంచి. శుభ్రంగా తుడిచావా లేదా? ఇంకోసారి తుడు" అని అయ్యరు గర్జించగానే మళ్ళీ వాడు ఇందాక తుడిచిన గుడ్డను దగ్గర వున్న బొక్కెనలో పిండి మళ్ళీ బల్లలను తుడిచాడు. తుడిచి మళ్లీ అయ్యరు ఏమంటాడో అనిచూస్తు అక్కడో స్తంభంవుంటే దానిదగ్గర నిలబడ్డాడు మా బల్లలమీద ముసిరిన యీగలు కుర్రాడి చేతిమీద ముసిరి తాండవం చేస్తున్నాయి తలమీద వెంట్రుకలు ముందుకు వాలి వుంటే భయవిహ్వలమైన కళ్ళతో ముఖం పెట్టాడు. ఇడ్లీలు వేడివేడిగా వున్నాయేమో పొగలు వస్తున్నాయి ఇద్దరం తినటం మొదలుపెట్టాం. తింటూ తింటూంటే అప్రియత్నంగా నా కళ్ళు ఆ కుర్రాడి మీదికి వెళ్ళాయి. ఆశలు నిండిన కళ్ళతో తినేవాళ్ళ నోళ్ళ వంక చూస్తూ ఆ మురికి గుడ్డ పట్టుకొని నిలబడ్డాడు. వాడికి ఇడ్లీ కావాలేమో అనిపించింది. ఇడ్లీ తినంగానే కాఫీలు వచ్చాయి. కాఫీలు త్రాగుతూ వుంటే ఆ ఇడ్లీ ప్లేట్లు తీసి గుడ్డపెట్టి బల్లలు తుడిచి నుంచున్నాడు. కాఫీ తాగి లేచాం. మేం లేవంగానే మళ్ళీ వాడు కాఫీ మరకలు తుడవటానికి వచ్చాడు వాడు అసహ్యంచుకోకుండా తుడుస్తుంటే నాకు ఆశ్చర్యం కలిగింది. మేం బిల్లులు చెల్లించి బయటకు వచ్చేశాం.

ఆఫీసుకు వచ్చి బి. డి. ఓ. గారిని కలిసికొని జాయినింగ్ రిపోర్టు యిచ్చి ఫైల్సు తీసికొని చార్జీ తీసికొన్నా. కాగితాలు చూస్తూంటే గోవిందరావు వచ్చి "భోజనానికి రెడీయేనా?" అన్నాడు. గడియారం చూస్తే పది అవస్తోంది పనిలో కాలగమనం తెలీదు. ఇద్దరం బయలుదేరాం. గోవిందరావు తీసికొచ్చి మళ్ళీ పొద్దున్న హోటలుకే తీసికొచ్చాడు. నాకు అరికాలిమంట నెత్తి కెక్కింది. కాఫీకే వెధవ హోటలు అనుకుంటే భోజనానికి కూడా యిదేనా హోటలు గతి" అన్నా గోవిందరావుతో విసుగ్గా. "బ్రిదర్! పొద్దునే చెప్పాగా అన్యథా శరణం నాస్తి అని" అన్నాడు నవ్వుతూ. ఏమీలేని చోట ఆముద వృక్షమే గొప్ప అయినట్లు యీ హోటలే యిక్కడో పెద్ద 'ఓ టాప్రియి' హోటలుగా వుంది.

'అయ్యరుగారూ! భోజనాలు సిద్ధమేనా?' అని గోవిందరావు అడిగాడు కుర్చీలో కూర్చుంటూ. నేను కూర్చున్నా.

"ఓ" అని "నారాయణ" అని పిలిచాడు అయ్యరు. గిరిజాలం, మాసిపోయిన బనీను. మురికి గళ్ళ లుంగీతో తయారైనాడు ఒక మనిషి.

"అయిందా?" అన్నాడు అయ్యరు.

"ఆ" అన్నాడు మా వంక చూసి.

"అయితే వెళ్ళండి" అన్నాడు అయ్యరు నేను క్రొత్తవాడిని కావటంచేత పుస్తకంలో నా పేరు వ్రాసి ఎడ్వాన్సుగా అయిదు రూపాయిలు పుచ్చుకొన్నాడు.

ఇద్దరం భోజనాల గదిలోకి వెళ్ళాం అక్కడ అంతా మురికిగా వుంది బల్లలు జిడ్డుపట్టి యీగలు ముసిరివున్నాయి. ఒక మూల దబ్బాలు గుడ్డలు పడి వున్నాయి. ఇది భోజనాల గదిట!

"నారాయణా! ఏమిటీ బల్లలనిండా గలీజు. తుడిపించకూడదా ఏమిటి? ఇట్లా అయితే మేం యీ హోటలుకి రాం" అన్నాడు గోవిందరావు కోపంగా ఒక కుర్చీలో కూర్చుంటూ. నేను తప్పనిసరి అయినట్టు కూర్చున్నా.

"ఓరేయ్ చందూ! ఎక్కడ చచ్చావురా! ఈ బల్లలు తుడవమని చెప్పలా? ఎన్నిసార్లు నీకు" అని నారాయణ విస్తళ్ళు చేతపట్టుకొని కేక వేశాడు.

నాకు యీ వాతావరణం నచ్చలా. ఎందుకంటే మా గదికి ఎదురుగుండానే వంట గది వుంది. అయ్యరు పెంపుడు పిల్లివలె వుంది పచార్లు చేస్తోంది. పనిచేసే మనిషి బహుశా మధ్యాహ్నం పకోడీలకల్లే వుంది, క్రింద ఉల్లిపాయ ముక్కలు తరిగిపోస్తోంది. ఇంతలోకే గోవిందరావు ఛీ ఛీ అన్నాడు. ఏమిటని చూస్తే కుక్క బల్లక్రింద పడుకొని లేవటల్లేదుట. దాన్ని నాలుగు తన్నేసరికి కుయ్యో కుయ్యోమని అరుచుకుంటూ పోయింది. గోవిందరావు పరోచితంగా నవ్వి" ఈ కాలంలో హోటల్లో కుక్కలు, హాస్పిటల్లో కుక్కలు, సినిమాహాల్లో కుక్కలు, ఆఫీసుల్లో కుక్కలు ఎక్కడ చూసినా శునక రాజ్యంగా వుంది" అన్నాడు. పొద్దున కాఫి బల్లలు తుడిచిన కుర్రవాడు ఒక బకెట్, రాళ్ళు తుడిచే గుడ్డ పట్టుకొని బల్లలమీద వున్న మెతుకుల్ని ఏరి బకెట్‌లో వేసికొని గుడ్డపెట్టి బల్లల్ని తుడవటం మొదలెట్టాడు. నా బల్ల తుడవటానికి వచ్చేసరికి ఆ గుడ్డనుండి వచ్చే దుర్గంధం ముక్కు బద్దలుకొడుతోంది వాడు ఎట్లా పుచ్చుకొని తుడుస్తున్నాడో అనిపించింది. ఒక చెంప బొద్దు క్రింద నుంచి తడి లాగు జారిపోతున్నా లెఖ చెయ్యక, ముక్కు కోంచి చీమిడి కారుతున్నా తుడుచుకోక భయ, వినమ్రా చలిత నేత్రాలతో ఆ గుడ్డపెట్టి తుడుస్తుంటే నేనే దాని దుర్వాసన భరించలేకుండావుంటే వాడు ఎట్లా దాన్ని చేత్తో పుచ్చుకొని తుడుస్తున్నాడో అనిపించింది. నారాయణ విస్తళ్ళువేసి "ఏయ్! రామూ! మంచినీళ్ల పట్టుకురా" అని. ఎదురుగుండా వంటింట్లోకి కూరలన్నీ తెచ్చి వడ్డించటం మొదలు పెట్టాడు. రాము అనే ఒక నల్లటి ఆకారం జిడ్డు కారుతూవున్న గ్లాసులతో మంచి నీళ్ళు పెట్టాడు. నీళ్ళమీద జిడ్డు తెప్పవలె తేలుతోంది! ఎట్లా గోట్లా అన్నింటికి భగవంతుడున్నాడని ముక్కు మూసుకొని మారు అడగకుండా రెండు మెతుకులు తిని బయటపడ్డా గండం తప్పిందని నేనే గోవిందరావుకంటె ముందులేచి హాల్లోకి వచ్చి అయ్యరుముందు ఖాళీ కుర్చీలువుంటే ఒక దాంట్లో కూర్చున్నా. అయ్యరు నా వంక చూసి "రేడియో పెట్టమంటారా?" అన్నాడు. "వద్దు అన్నా. కాసేపటికి గోవిందరావు వచ్చాడు ఇద్దరం ఆఫీసుకు బయలుదేరాం.

"పాపం యింటి పట్టున వుంటున్న వాడివి. ఈ వెధవ ట్రాన్స్‌ఫరు నీకు వచ్చింది. ఈ పూట భోజనం చెయ్యలా నువ్వు. కాని యింతకంటే హోటలు యీ వూళ్ళోలేదు. కనుక తొందర్లో

(తరువాయి 17 వ పేజీలో)

# చందు

(12వ పేజీ తరువాయి)

కాపురం పెట్టుకో. నేనా బ్రహ్మచారిని. దిగుల్లేదు. మనకు యీ కూడు అని లేదు. ఎటుపడితే అటు తట్టుకోగలను జీవితం అంటే నా దృష్టిలో పరిస్థితులకు సర్దుబాటు చేసికొని కష్టంలోకూడా సుఖాన్ని చూడగలిగేదే అని, నాకు యీ హోటలు భోజనం నచ్చదనుకో. ఏమిటి చేసేది? భోజనం కోసం పెళ్ళిచేసుకోము గదా! స్వయం పాకం చేతగాదు. కనుక తప్పదు సర్దుబాటు చేసికోక" అన్నాడు గోవిందరావు హోటలు భోజనంతో జీవితపాఠం నేర్చిన గోవిందరావును చూస్తే నవ్వు వచ్చింది.

"ఏం నవ్వుతావు? నేను పొరపాటు అన్నానా?" అన్నాడు.

"అలోచిస్తే ప్రతివాడూ నువ్వు చెప్పిన పరిస్థితులకు సర్దుబాటు చేసికొనేవాడే. కొత్త ఏం లేదు. ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడైనా సర్దుబాటు చేసికోక తప్పదు. కాకపోతే హోటలు భోజనం నీకు అంత ఎందుకు నచ్చిందా? అని నవ్వా" అన్నా.

"నాకు అలవాటు అయింది" అన్నాడు. ఇద్దరం ఆఫీసుకు వచ్చాం.

సాయంకాలం ఆఫీసు అవంగానే గోవిందరావు యింకా కొంతమంది ఏటి ఒడ్డుకు షికారు వెళ్ళారు. కోసెడుదూరం అవటం మూలాన నేను రానన్నా. అదీ గాక కాపరం పెట్టటానికి ఇల్లు చూసుకోవాలి. ఆఫీసులో ఎన్నాళ్ళని వుండనిస్తారు? గోవిందరావుకు గది కావాలిట. కాని ప్రయత్నం చెయ్యడు. సత్రం భోజనం మఠం నిద్రలా బాగున్నట్లుంది. బి. డి. ఓ. మంచివాడు కాబట్టి సరిపోయింది. అయినా మర్యాదకైనా హద్దు వుంది. ఎపుడో చెపుతాడు. ఆఫీసులో వుండద్దని. అందాకా గోవిందరావుకు గది దొరకదు నాలుగురోడ్ల జంక్షనులోకి రాంగానే కాఫీ తాగితే బాగుండుననిపించింది. హోటలులోకి దారి తీశా. హోటల్లో ఎవరూ లేరు. అయ్యరు ఒకడు రేడియో పెట్టుకొని కూర్చున్నాడు. సిలోన్ కేంద్రం నుంచి తెలుగు రికార్డులు వస్తున్నాయి. కాఫీ కావాలనంగానే అయ్యరు స్వయంగా వెళ్ళి కాఫీ తయారు చేసికొని తీసికొచ్చాడు.

"పొద్దున యిలా లేదేమండి" అన్నా తాగుతూ.

"వాళ్ళకు తెలీదండి ఎట్లా కలపాలో. అది సార్వీస్‌మీదగాని రాదు. మీకు యింకా తెలీదు. ఈ చుట్టు ప్రక్కల నాతో సమానంగా కాఫీగాని పెసరట్టుగాని తయారు చేసేవాడు లేడు. అసలు మొట్ట మొదట పెసరట్టుకు పెట్టిందిపేరు మా హోటలు" అని అయ్యరు నేను యిచ్చిన బేడ గల్లా పెట్టెలో వేసికొన్నాడు. "ఏయ్ చందూ గ్లాసు తీసికొని పో" అని అయ్యరు నా గురించి వివరాలు అన్నీ తెలిసికొన్నాడు. బహుశా ఎన్నాళ్లు హోటలు భోజనం చేస్తాననేమో తర్వాత నేను అడగకుండానే స్వీయ కథ చెప్పాడు." మాది మలబారు. నాయర్లు అంటారే వాళ్ళం, పదునాలగవ ఏట జీవనోపాధికోసం అన్వేషణ చేస్తూ యీ వూరు వచ్చా. అపుడు యీ రోడ్లు కార్లు లేవు. ఇదంతా చూడటానికి అడవి వలె వుండేది. మొట్ట మొదట దోవప్రక్క పెసరట్టువేసి అమ్మేవాడిని. అపుడు పెసరట్టు కానీ, నా పెసరట్టు అంటే పడి చచ్చేవాళ్లు జనం. అక్కడనుంచి నెమ్మదిగా ఒక గుడిసె అద్దెకు తీసుకొన్నా నెలకు పావలా యిచ్చి. అందులో యిడ్లీ కూడా పెట్టా. ఈ చుట్టు ప్రక్కల ఏమిటి యీ తాలుకాలోనే నాతో సరి సమానంగా పెసరట్టు వేసేవాళ్ళు అప్పట్లో లేరు, ఒక విధమైన రుచి వుండేది నేను వేసిన పెసరట్టులో. ఆ విధంగా వ్యాపారం పెరిగి ఒక డాబాలోకి మారింది. ఇపుడు యీ వూళ్ళో మాదే పెద హోటలు" నాకు ఆశ్చర్యం వేసింది. మలబారుకు చెందినవాడు కానీ పెసరట్టుతో కుబేరుడు కావటం ఆశ్చర్యంకాదు షుఠీ! అదృష్టం!

"మరి అయితే యీ పాటికి డబ్బు ఏ మాత్రం నిల్వ చేశారు?" అన్నా చొరవ చేసికొని.

"ఒక పదివేలు రొఖం బ్యాంకులోవుంది. ఈ బిల్డింగ్ నేను కట్టించిందే" అన్నాడు నవ్వుతూ.

"మరైతే పొలం లేదా?" అన్నా.

"లేకేం? పన్నెండు ఎకరాలు మాగాణి మూడెకరాల మెట్ట స్వార్జితంగా కొన్నా. అవి కూడా యీ వూరికి పదిమైళ్ళ దూరంలోనే" అన్నాడు.

"మరైతే పిల్లలు ఎంతమంది?" అన్నా అప్రయత్నంగా. ఈ ప్రశ్న ఎందుకడిగానో నాకు తెలీదు. అడగాలని అడగకుండా మామూలు ధోరణిలో వచ్చేసింది. ఈ ప్రశ్నకు అయ్యరు జవాబు చెప్పటానికి తటపటాయించాడు. ముఖం నల్లబడింది. చివరకు "ఒకడు" అన్నాడు, అంటూండగానే "నాన్నా" అంటూ పుస్తకం, పలక పుచ్చుకొని ఒక తొమ్మిదేళ్ళ కుర్రాడు అయ్యరు పొట్టమీద వాలాడు.

ఇతనేనా మీ అబ్బాయి" అన్నా.

"అవును" అని కుర్రాడిని నిమిరి చదువుకోడు. బడికి వెళ్ళడు. మీరైనా చెప్పండి" అన్నాడు.

"పేరు?"

"మురళీ"

"ఏమోయ్ మురళీ, బడికి వెళ్ళక పోతే చదువు ఎలా వస్తుంది!" అన్నా హాసంగా.

"మా నాన్న అట్లాగే అంటాడు. నేను చదువుకుంటనే వున్నానండి"అన్నాడు కుర్రాడు. తర్వాత అయ్యరును గుంజి పావలా బిళ్ళతీసికొని మురళి పరుగెత్తు కెళ్ళాడు. "ఇదే వరసండి" అన్నాడు "ఏం చేస్తాం! పిల్లలు" అన్నా. కాని శిక్షణలేని కుర్రాడనిపించింది. నేను రోజూ అయ్యరు హోటలుకి సాయంకాలం రికార్డులు వినటానికి వెళ్ళటం అలవాట

యింది. మామూలు ప్రకారం రికార్డులు వినటానికి వెళ్లా. ఆ రోజున అయ్యరు లేడు. పట్నం వెళ్ళాడు. వాళ్ళ కుర్రాడు ఒక అంకెకూడికలు చేస్తున్నాడు. ఆరు, మూడు ఎంతో లెఖ్ఖ పెట్టటానికి సతమత మవుతున్నాడు. నేను రావటం చూసి "ఆరు మూడు ఎంతండి" అన్నాడు. ఒకట్లు రాకుండా కూడికలకు ఎక్కినట్లున్నాడు.

"ఆరు మూడు తెలీదా! ఉష్! తొమ్మిది" అన్నాడు చందూ. నేను జవాబు చెప్పక ముందే. ఆశ్చర్యం వేసింది. చందూకు చదువు వచ్చన్నమాట

"చందూ! నోర్మూయ్! నిన్ను అడగలా" అని మురళీ చందూ చెంపమీద ఫెళ్లున కొట్టి "మీరు చెప్పండి. ఆరు మూడు ఎంత?" అన్నాడు నా వంక తిరిగి పెన్సిలు పట్టుకొని.

"చందూ చెప్పినా అంతే. నేను చెప్పినా అంతే. ఆరు మూడు తొమ్మిదే. అనవసరంగా పాపం చందూను కొట్టావెందుకు?" అన్నా.

"తొమ్మిదేనా" అని ఆశ్చర్యంగా, "చందూ రైటు చెప్పాడన్నమాట" అంటూ కూడిక పూర్తిచేశాడు.

చందూ చెంపమీద అయిదువేళ్ళు తేలినాయి. "చూడండి. నేను సరిగ్గా చెప్పినా ఎట్లా కొట్టాడో" అని చందూ ఏడుస్తూ వెళ్ళిపోయాడు. పొద్దస్తమానం కాఫి కప్పులు కడుగుతూ మురికిలో బతికే చందూకు కూడా పుస్తకాలు, పలక, బలపం వుంటే చక్కగా చదువుకొంటాడు గదా! తిని పారేసిన ప్లేట్లు ఎంతకాలం కడుగుతాడు? ఆ మురికిలో ఎన్నాళ్ళని మగ్గిపోతాడు? వాడి జీవితం అంతా కాఫీ కప్పులు కడుగుతూ వెళ్ళమారి పోవలసిందేనా? వాడి బ్రతుకు అంతా మురికినీళ్ళు కెలకడంతో, బెంచీలు తుడవటంతో గడిచిపోవసిందేనా? అందరూ హోటలుకువచ్చి మెక్కుతుంటే కిందపడ్డ యిడ్లీ ముక్కలు, పెసరట్టు ముక్కలు వంక ఆశగా నిలబడిచూస్తూ వుండవలసిందేనా? చందూ చేసిన పాపం ఏమిటి? చందూ జీవితం మొగ్గలోనే మగ్గిపోవలసిందేనా? ఈ రకమైన ఆలోచనలతో చందూ యందు సానుభూతి ఎక్కువైంది చెంపదెబ్బ చూసేసరికి.

మర్నాడు సాయంకాలం అయ్యరు హోటల్లోనే వున్నాడు. సేల్సు టాక్సు పనిమీద పట్నం వెళ్లానని, యివాళ వుదయమే వచ్చానని చెప్పాడు. రేడియోలోంచి సన్నగా సంగీతం వస్తోంది. హోటల్లో జనంలేరు.

"మేష్టారూ! ఇదేమిటో చెప్పండి" అంటూ పరుగెత్తుకొచ్చాడు చందూ.

"సి" అన్నా. వాడు పలకమీద ఎ. బి సి. లు దిద్దుతున్నాడు

"చందూ! ఏ క్లాసు?" అన్నా.

"మూడు" అని మూడు వేళ్ళు చూపించి చదువుతున్న వాచకం చూపించాడు అందులో కొన్ని పేజీలు చిరిగిపోగా మిగిలినవి మడతలుపడి నూనె మరకలతో వున్నాయి. సగం విరిగిన పలక, పిక్కబలపం చేత్తో పట్టుకొని బొడ్డు క్రిందికి తడిసినలాగూ జారిపోతుంటే లాక్కుంటుంటే ఆంగ్ల విద్యాభ్యాసానికి అర్రులు చాస్తూ ఉజ్జ్వల భవిష్యత్‌కోసం ఆశిస్తున్న చందూవంక చూస్తే జాలేసింది.

"రోజూ బడికి వెడుతున్నావా?" అని అడిగా. వెళ్ళడని నాకు తెలుసు.

బడికి వెళ్ళటానికి వీలులేదు మేష్టారు. హోటల్లో పని చెయ్యాలిగా మరి. రోజూ సాయంకాలం మురళికి చెప్పటానికి ప్రయివేటు మాష్టారు వస్తారు. ఆయన చెపుతుంటే వింటా" అన్నాడు "కేవలం విని చదువుకొంటున్నావా?" అన్నా ఆశ్చర్యంగా. నాకు తెలీనవి మీ వంటి వాళ్ళ చేత చెప్పించుకొంటా. అడిగి తెలుసుకొంటా" అన్నాడు అక్షరాలు వంక చూస్తూ.

ఈ విధంగా ఎంతమంది బాలుర జీవితాలు అవకాశాలు లేక అడవికాసిన వెన్నెల అవుతుందో! చందూ చక్కగా రోజూ బడికి వెళ్ళి చదువుకొంటే చదువు బాగా వస్తుంది కదా! ఏ స్కూలు ఫైనల్‌వరకు చదువుకొంటే వాడి పొట్ట వాడు పోషించుకుంటాడు. కేవలం బడికి వెళ్ళలేని కారణంగా జీవితం నట్టేటమునిగిన నావ అవుతోంది. ఇట్లా ఒక్కడూ ఎంతకాలం తంటాలు పడగలడు? అయ్యరు హోటల్లో పని చేసినందుకు ఏమి యిస్తాడూ? బహుశా రెండు పూటలా తిండిపెట్టి నెలకు పదికంటె ఎక్కువ యివ్వడు. అందుకు శిశు జీవితం అంతా నిరక్షర కుక్షియై దాస్య బంధనంలో మునిగిపోవసిందేనా? ఆ మురికిలో మగ్గిపోతూ రోగజీవులకు నిలయం కావలసిందేనా? ఇందుకు ప్రత్యామ్నాయం లేదా? ఇంతలో మురళి పుస్తకాలు పట్టుకొని పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"నాన్నా! బడి నుంచి వచ్చావా?" అన్నాడు అయ్యరు దగ్గరకు తీసుకొని.

"అవును" అని చందూ పలకమీద ఎ. బి సి లు చూసి "ఇవాళ నాకు బళ్ళో ఎ బి. సి. లు చెప్పారు దిద్దాలి" అని మురళి బడిలో పంతులు నోట్‌బుక్‌లో వ్రాసి యిచ్చిన అక్షరాలు చూపించాడు.

"దిద్దుకో పో" అన్నాడు అయ్యరు కుర్రాడిని వదలుతూ "మా వాడు చాకు అండి. ఒకసారి చెపితే చాలు చదవక్లా. ఆ పాఠం వచ్చేస్తుంది" అని ముద్దు పెట్టుకొంటూ నవ్వాడు గర్వంగా.

ఇంతలోకే చందూ అందుకొని "అయ్యగారూ! నిన్న కూడిక చేస్తూ ఆరు మూడు ఎంతో చెప్పలేకపోయాడు" అన్నాడు అయ్యరుతో.

"ఏం నాన్నా! చెప్పలా" అన్నాడు అయ్యరు.

అన్నీ అబద్ధాలే నాన్నాగారూ! నేను చెప్పా" కోపంతో చందూ దగ్గరకువెళ్ళి "ఈ ముండకు తెలుసు గామాలును. అపుడే ఎ. బి. సి. డి. లు దిద్దుతున్నాడు." అని చందూలోంచి సగం విరిగిన పలక తీసికొని హాల్లోకి విసిరికొట్టాడు. చిన్నాభిన్నమైన పలక ముక్కలు చెదరిపోయినాయి. చందూ కళ్ళలో నీళ్లు తిరిగినాయి.

ముఖం చిన్నబోయింది. సత్యం చెప్పినందుకు శిక్ష!

"అయ్యగారూ చూడండి. నా పలక పగుల గొట్టాడు మురళి" అని చందూ ఏడుపు ముఖం పెట్టాడు. అయ్యరు తన కుర్రాడు పలక పగల కొట్టినందుకు మందలించటం పోయి" ఏం రా నాన్నా! పలక పగల కొట్టావా?" అని చందూ పో లోపలికి వెళ్ళి పని చూసుకో. యింకో పలకకొనిపెడతాలే. వెధవ చదువు తర్వాత చదవచ్చులే. ముందర పని చూసుకో" అన్నాడు చందూ వంక తిరిగి. చందూ నిర్లిప్తతతో చిరిగిన వాచకం జేబులో కుక్కుకొని పగిలిన పలక ముక్కలు వంక చూస్తూ లోపలికి వెళ్ళిపోంగానే "చూడండి మేష్టారు! ఈ బోడి గాడికి ఒక బోడి పలక, చదువుట. ఈ ముండ చదివి ఏం చేస్తాడో" అని తన యింగ్లీషు అక్షరాలు అయ్యరుకు చూపించి" ముద్దుగా అడిగాడు మురళి అయ్యగు నాన్నా ఇంగ్లీష్ పుస్తకం కొనిపెట్టవూ?" అని ఉంపుడుకత్తెకు పుట్టినవాడని విన్నా. కాని అయ్యరు స్వంత కొడుకల్లే చూస్తాడు ఏమీ అనడు.

"అబ్బ! కొని పెడతా లేరా! ముందర యీ అక్షరాలు రాసి" అని "సరే కాని ఆ బీరువాలో స్వీట్సు వున్నాయి, నీకు కావలసింది తిను పో" అంటూ బెల్లు కొట్టి "ఒరేయ్! నారాయణా! ఒక కాఫీ చేసి పట్రా అబ్బాయికి" అన్నాడు మురళి బీరువా దగ్గరకి వెళ్ళి ఒక బూంది లడ్డుతీసి, కొరికి, "ఛీ! వెధవ లడ్డూ ఏంబాగుండలా" అని అవతలకి గిరాటు కొట్టాడు " అట్లా పారేయకురా" అని అరిచాడు అయ్యరు. మళ్ళీ ఒక జాంగ్రితీసి మురళి వాసన చూసి ఛీ! ఇది బాగుండలా నూనె కంపు" అని అవతల పారేశాడు హాల్లోకి.

"పోనీలే ఏం బాగుండకపోతే, ఇట్రా కాఫీ తాగుదువుగాని" అని అయ్యరు అనంగానే వచ్చాడు. పారేసిన జాంగ్రి, లడ్డూ ముక్కలను కుక్కనోట కరుచుకొని పోయింది. నారాయణ తెచ్చిన కాఫీని వూదుకుంటూ తాగాడు ఇట్లా వుంటాయి! నిరుపేదల బ్రతుకులకు, వున్నవారి బ్రతుకులకు వ్యత్యాసాలు! అనిపించింది. చందూకు పగిలిన పలకతో కూడా చదువుకోటానికి అవకాశం లేదు. కాని కుక్కనోట్లోకి లడ్డూ వుండపోయింది. మనిషికి మానసిక ప్రవృత్తికి రూపం యిచ్చేది పరిసర వాతావరణంబట్టే. కూటికి గతిలేని చందూ మురికి గుడ్డతో బల్లలు తుడుస్తూ ఊడిగం చేస్తుంటే మురళికి లడ్డూ నయం చలా. పగిలిన పలకమీద ఎ. బి సి డి.లు దిద్దుకుందామని చందూ ఆరాటపడుతుంటే మురళికి అరు మూడు తెలీదు చిత్రం!

మామూలు ప్రకారం హోటల్లో రేడియో వినటానికి వెళ్ళా. అయ్యరువేడు మురళి ప్రయివేటు చెప్పించుకొంటున్నాడు. ఎవరో ప్రయాణీకుడు వచ్చి కూర్చుని "టీ" అన్నాడు. చందూ బల్ల తుడుస్తూ వణికి పోతున్నాడు. "ఏం చందూ వణికిపోతున్నావు?" అన్నా. "మేష్టారు! రాత్రి నుంచి చలి జ్వరం" అన్నాడు మా అయ్యగారు పలకకొని యివ్వలేదండి. నేనడిగితే కోపడుతున్నారు. ఎ బి సి డి లు రాసి" అన్నారని మురళికి ప్రయివేటు చెపుతుంటే బల్ల తుడిచి తలుపు పక్కగా ముడుచుకొని కూర్చున్నాడు.

"మందు వేసికోలా?" అన్నా జాలిగా.

"లేదండి ఎక్కడినుంచి వస్తుంది" అన్నాడు విచార చిహ్నం ముఖంలో కనపరుస్తూ.

"అదేమిటి? మందు వేసికోకపోతే ఎలా తగ్గుతుంది జ్వరం ఆస్పత్రికి వెళ్ళు" అన్నా. అన్నానేగాని నా మాటలలో శుష్కత్వానికి నాకే సిగ్గేసింది. ఆస్పత్రిలో ఎనిమిదేళ్ళ కుర్రాడికి మందు దొరుకుతుందా? నమ్మదగ్గ విషయంకాదు. ఎంతో మహోదయగల డాక్టరు వుండి విచారిస్తే తప్ప.

"అయ్యగారిని అడగాలి" అన్నాడు. వణుకు స్వరంతో.

ఇంతలో గోవిందరావు వచ్చి సినిమాకు రమ్మనమని లాక్కెళ్ళాడు. ఆ వూరికి వచ్చే చిత్రాలు అన్నీ బాగా పాతవే అయినా జనానికి వేరే గత్యంతరం లేదు. నాకు వెళ్ళటం యిష్టంలేకపోయినా గోవిందరావు బలవంతంమీద వెళ్ళక తప్పలా.

రోజులు గడుస్తున్నాయి. నేను రోజూ సాయంకాలం హోటలుకు వెళ్ళటం తగ్గింది. ఏ స్నేహితునితోనో షికారు వెళ్ళటమో, ఇల్లు చూడటానికి వెళ్ళటమో జరుగుతోంది. కాని తగిన వసతిగల కొంప అందుబాటైన అద్దెలో దొరకటల్లా. ఒక రోజున రాత్రి నేను గోవిందరావు హోటల్లో భోంచేసి హాల్లో కుర్చీల్లో కూర్చున్నాం. చందూ హాల్లో గాసులు సర్దుతున్నాడు. చాలా రోజులనుంచి నేను చందూని చూడటంలా. చాలా బక్క చిక్కి వున్నాడు. కళ్ళలో వున్నాయి ప్రాణాలు. మెడలో ఏవో తాడు వుంది.

"ఏం చందూ! అలా వున్నావే" అన్నా జాలిగా. గోవిందరావుకూడా అడిగాడు.

"జ్వరమండి" అన్నాడు నీరసంగా.

"అప్పటి నుంచి తగ్గలా?" అన్నా ఆశ్చర్యంగా.

"లేదండి?"

"మరి మందో?"

"మా అయ్యగారు ఎక్కడో యిప్పిస్తున్నారు."

"మెళ్ళో ఆ తాడు ఏమిటి?"

"చలిజ్వరాలకు తాడు ఏదో వేస్తారుట. ఇవాళ మా నారాయణ వేయించాడు." అని నుంచోటానికి కూడా ఓపికలేక బల్లమీదకు వాలాడు." పని చేస్తావే పో!" అని నేను. గోవిందరావు కేకవేసాం.

"అయ్యగారూ గ్లాసులు సర్దమంటే వచ్చా" అని వెళ్ళిపోయాడు. చందూ అంటే నాకు, గోవిందరావుకు ఒక విధమైన అపేక్ష, చనువు, అభిమానం. ఎందుకంటే చందూ చలాకి అయిన కుర్రవాడు ముఖంలో కళ వుంది. వాడు లేని వాడవటంచేత బల్లలు తుడిచే రాత పట్టిందికాని అదే ఏ ధనికుల బిడ్డ అయితే ఎంత అల్లారు

ముద్దుగా పెరిగేవాడో। చందూకు రోగం వచ్చినా మందులేదు. దాదాపు యిరవై రోజులక్రితమే చూసినపుడు చలితో వణుకుతున్నాడు. ఇంతవరకు తగ్గలా. అయ్యరు అదే తన కుర్రాడికి వస్తే వూరుకొనేవాడా? చందూ ఏదో మందు యిప్పిస్తున్నాడని అన్నా అది ప్రయోజన రహితం అయినపుడు లాభం ఏమిటి? ఎప్పుడూ మురికి నీళ్ళలో తిరిగే చందూను చలిజ్వరం పట్టుకోక ఏం పట్టుకుంటుంది? అయ్యరు గల్లా పెట్టి నిండటానికి, హోటలుకు వచ్చిన జనం తిరిగిపోకుండా వుండటానికి చందూ లేత చేతులు బల్లలు తుడవటానికి కావాలి. కాని వాడు రోగం పాలవుతే మందులేదు. నేను గోవిందరావు అయ్యరును తిట్టాం. కరడుగట్టిన స్వార్థపురుగు।

వారం గడిచింది. మామూలు ప్రకారం నేను గోవిందరావు ఉదయంపూట కాఫీ హోటలుకు బయలుదేరాం స్నానాదులు పూర్తిచేసుకొని. ఇంతలో మా ఆఫీసు జవాను సుబ్బారావు.

"ఇవాళ ఆ హోటలుకు వెళ్ళద్దండి" అన్నాడు.

"ఏం?" అన్నా.

"నేను యిపుడే వెళ్ళి వచ్చా చందూ చచ్చిపోయాడు. వాకిలికి దగ్గరగా అక్కడే పడుకోబెట్టారు. అంతా చూసున్నాడు." అన్నాడు.

నేను, గోవిందరావు ఆశ్చర్యపోయాం. చందూ చచ్చిపోవటమా? గాలికి ముంగురులు ముఖంమీదికి వాలుతుంటే ముద్దుగా కనిపించే చందూ చచ్చిపోవటమా? నేనూ, గోవిందరావు చూడటానికి వెళ్ళాం. చందూను హోటలుకు కొద్ది దూరంలో ఒక చినిగిన చాపమీద గుడ్డకప్పి పడుకోబెట్టారు. నారాయణ యింకా యిద్దరు ముగ్గురు వున్నారు. అయ్యరు హోటలు అరుగుమీద కూర్చున్నాడు చందూ చచ్చిపోయినా సజీవంగానే వున్నట్లు వున్నాయి కళ్ళు. ముఖంలో కళ తగ్గలా. వాడికోసం కన్నీరు కార్చేవారుకూడా లేరు.

"అయ్యరుగారూ? ఎపుడూ పోయింది" అన్నాడు గోవిందరావు.

"తెల్లారు గట్ల"

"వాళ్ళ వాళ్ళు లేరా?"

"కబురుచేశా మనిషిచేత. రావాలి" అన్నాడు.

"వాళ్ళ వాళ్ళు వున్నారా?" అన్నా ఆశ్చర్యంగా.

"ఆ వాడికి అమ్మ, నాన్న వున్నారు. వాళ్ళిద్దరూ కూలి చేసికొని బ్రతుకుతారు. రెండేళ్ళ క్రితమే నాకు అప్పగించి పోయారు." అన్నాడు అయ్యరు.

"ఇక్కడికి ఎంతదూరం?" అన్నాడు గోవిందరావు.

"డెబ్బై మైళ్ళు. బస్సు వుంది. మనిషిని పంపించా. రావాలి మధ్యాహ్నానికి అన్నాడు అయ్యరురారని అనకుండా

"పేదవారి బ్రతుకులు యిలాగే వుంటాయి. విధాత జగన్నాటకం బహు చిత్రమైంది. డబ్బున్నవాడికి వారసులు వుండరు. పేదవాడికి వున్నా భారం. కూలి చేసికొని పొట్ట పోసుకునే పేద దంపతులకు పసివాడే భారం అయినాడు. వాడి బరువు, బాధ్యతలను వదుల్చుకోటానికి యీ అయ్యరు హోటలు ఉచ్చు అయింది. అదే వాడి ప్రాణానికి యమదూత అయింది. ఈ మురికి వాతావరణం, బాధలు భరించలేని చందూ శాశ్వత శాంతిని చూసుకున్నాడు. అయ్యరు పలకకొని పెట్టలేదని యిక చందూకు దిగులు వుండదు. ఎబిసిడిలు రాలేదని దుగ్ధ వుండదు

ఆ రోజున నాకు గోవిందరావుకు ఏదో పిచ్చిగా వుంది తర్వాత చందూ తల్లి తండ్రులుకూడా రాలేదని, యీ వెళ్ళిన మనిషికి వాళ్ళ అంతుపట్టలేదని విన్నాం. ఎంత నికృష్టచావు చచ్చాడు చందూ। కనీసం కన్నవారి చెంతనైనా ప్రాణాలు విడవలేకపోయాడు. ఆ పసివాడి ప్రాణం అమ్మా నాన్నలకోసం ఎంత క్షోభించిందో। ఎంత తల్లడిల్లిందో। దాదాపు యిరవై రోజులనుంచి జ్వరంగావుంటే కనీసం అయ్యరు తల్లి తండ్రుల వద్దకైనా వాడిని పంపించలా. శాంతిగా అయినా చచ్చిపోయేవాడేమో లేక నయమై బాగుపడేవాడో।

ఆరు నెలలు గడిచిన తర్వాత నాకు ఆ వూరు నుంచి తిరిగి బదిలీ అయింది. ఆ వూరు విడిచి వచ్చేశా. కాని జీవితంలో చందూ మరుపలేనివాడయ్యాడు హోటల్లోకి వెళ్ళాలంటే జుగుప్స కలిగిస్తుంది ఈ విధమైన పసి జీవితాలు అజ్ఞాతంగా ఎన్ని బలి అవుతున్నాయో. అవకాశాలులేక అణగిపోతున్నాయో అని।

—:O:—

## ఎన్నాళ్ళకెన్నాళ్ళకో...

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకో నన్ను
నీ
కన్నుల్లో చూచుకో కలిగాను
ఎన్నాళ్ళ కెన్నాళ్ళకో నిన్ను
నా
కన్నుల్లో దాచుకో గలిగాను

వెన్నెల్లో హాయికలదని
వెన్నలాంటిది కన్నె మనస్సని
ఎన్నాళ్ళ కెన్నాళ్ళకో
తెలిసికో గలిగాను

పువ్వుల్లో ప్రేమ పొంచివుంటుందని
నవ్వుల్లో నైర్మల్యత పెంచుతుంటుందని
జతగాని బ్రతుకు యెతలేని దని
ఎన్నాళ్ళ కెన్నాళ్ళకో తెలిసికోగలిగాను.

బంగారు బ్రతుకునావకూ
చిన్నారి నారత్తి 'చుక్కాని' యని
ఎన్నాళ్ళ కెన్నాళ్ళకో
తెలిసికో గలిగాను.

– వెలివల సాంబశివరావు